www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 జనవరి 2024
5
అన్నమయ్య



ఇంటర్న్‌షిప్‌కు 'మిట్స్' విద్యార్థులు ఎంపిక



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి : మిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న తహసీన్, మౌక్తికరెడ్డి, చైతన్య జపాన్‌లోని ఐవాటే ప్రిఫెక్చరల్ యూనివర్సిటీకి ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ విద్యార్థులు 3 నెలల పరిశోధన ఇంటర్న్‌షిప్ కోసం జపాన్ కు వెళ్లారని పేర్కొన్నారు. వీరు ఐవాటే ప్రిఫెక్చరల్ యూనివర్సిటీ-జపాన్ లో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ పై పరిశోధనలు చేస్తారని తెలిపారు. ఎంపిక అయిన విద్యార్థులను కరెస్పాండెంట్ డాక్టర్. ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, డీన్ ఇంటర్నేషనల్ డాక్టర్ శ్రీమంత బసు, ఇంటర్నేషనల్ రిలేషన్స్ సీనియర్ మేనేజర్ యూ.విజయ లక్ష్మి, తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఎన్ని చట్టాలు తెచ్చినా భయపడేదేలే

- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- 30వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు



రాయచోటి : ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

జీతాలు పెంచేదాకా సమ్మె విరమించే ప్రసక్తే లేదని ప్రజాసంఘాల నేతలతో కలసి అంగన్వాడీలు ప్రతిజ్ఞ చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఐదు రోజులుగా రిలే నిరాహారదీక్షలలో భాగంగా చిట్వేల్, రైల్వేకోడూరు, లక్కిరెడ్డిపల్లి వర్కర్లు దీక్షల్లో కూర్చున్నారు. అంగన్వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, ఒపిడిఆర్ ఈశ్వర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, కెవిపిఎస్ కన్వీనర్ డిసి.వెంకటయ్య, రజక సంఘం శ్రీనివాసులు, రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఎంహెచ్‌పిఎస్ సగీర్, జెవివి నాయకులు హరిశర్మ, ఐలు నాయకులు సోమశేఖర్, అంగన్వాడీ యూనియన్ వర్కింగ్ ప్రెసెడెంట్ డి.భాగ్యలక్ష్మి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం, ఐసిడిఎస్ అధికారుల చేత షోకాజ్ నోటీసులు ఇప్పించడం ఆపాలని అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతుందని విమర్శించారు. సమ్మె దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అంగన్వాడీలు ఎక్కువమంది బడుగు బలహీన వర్గాలకు చెందిన వారిని, ఈ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పని భారం పెరిగిందని, రోజుకు 18 గంటలు పనిచేస్తున్నా కనీస వేతనం చెల్లించలేదని విమర్శించారు. వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులు తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహార సరుకులు ఇవ్వమని చెప్పడం తప్పా అని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడివిటీ ఇవ్వాల న్నారు. **రైల్వేకోడూరు:** పట్టణంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్షులు రమాదేవి మాట్లాడుతూ అంగన్వాడీలు 30 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం విచారకరమన్నారు. అంగన్వాడీలు ఐసిడిఎస్ కార్యాలయం సమీపంలో మాట ఇచ్చావు జగన్ మాట తప్పవు జగన్, భగభగ మండే సూర్యుడిని చూడు అంగన్వాడీల సత్తా చూడు అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్, సిఐటియు అనుబంధం జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మీ, ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు వనజ కుమారి, అధ్యక్షులు, శ్రీరమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధా కుమారి, మండల కార్యదర్శి జి.పద్మావతి, వెన్నెల, దుర్గ, శిరీష, లీలావతి, జయకుమారి, సుజాత, మునీంద్ర, ఈశ్వరమ్మ, కుమారి, నాగరాణి, వాణి, స్వర్ణలత, గీత, సురేఖ, కళ, రెడ్డమ్మ, రోజా, చెంచులక్ష్మి, బేబీ, సునీత, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జాన్ ప్రసాద్, నాయకులు సరోజ నిర్మల నాగమణి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో అంగన్వాడీలు పెద్దఎత్తున పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగిస్తామని తక్షణం విధుల్లో చేరాలని వత్తిడి చేస్తున్నప్పటికీ భయపడే ప్రసక్తి లేదని ప్రాజెక్టు అధ్యక్షులు సుకుమారి అన్నారు. లక్కిరెడ్డిపల్లి మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద 30 రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి ఓబులమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎస్మాను ఉపసంహరించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంగన్‌వాడీలపై విధించిన ఎస్మాను తక్షణమే రద్దుచేయాలని, అదేవిధంగా అంగన్‌వాడీలతో పాటు మున్సిపల్, సర్వశిక్ష కార్మికుల జీతాలను పెంచాలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. సంక్రాంతిలోపు ఈ డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించాయి. ఉద్యోగ కార్మిక సంఘాల సమ్మెలకు మద్దతుగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీంవగా తీర్మానం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టిడిపి, సిపిఐ, న్యూడెమోక్రసీ, జనసేన, విసికే పార్టీలు, సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల, ఐలు, ఒపిడిఆర్, కెవిపిఎస్, ఎంహెచ్‌పిఎస్, రజక సంఘం, ఎమ్మార్పీఎస్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న అబద్దాలకు అంతు లేకుండా పోయిందన్నారు. ఎస్మా ప్రయోగించినా కార్మికులు పట్టువీడటం లేదంటే వారి బాధ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అంగన్‌వాడీలు అత్యవసర విభాగం అని భావిస్తే ఇన్ని రోజులు ఎందుకు సమస్యను పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో జగన్‌కు శృంగభంగం తప్పదని, మహిళలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఆందోళనలు చేస్తుంటే అరెస్టులు చేయడం తెలివితక్కువతనమని పేర్కొన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో సిబ్బంది గొడ్డుచాకిరీ చేస్తున్నారని అన్నారు. సంక్రాంతిలోపు సమ్మెలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అన్ని పార్టీలు ప్రత్యక్ష ఆందోళనకు దిగడంతోపాటు, రాష్ట్ర బంద్ చేపడతామని హెచ్చరించారు. టిడిపి నాయకులు సుగవాసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్మికులకు ఏమి కావాలో తెలుసుకోకుండా భయభ్రాంతులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్.నరసింహులు మాట్లాడుతూ ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేసేందుకు గంటల సమయం తీసుకుంటున్న ముఖ్యమంత్రి 30 రోజులుగా సమ్మె చేస్తున్న మహిళలతో చర్చించేందుకు గంట సమయం కేటాయించకపోవడం అన్యాయమన్నారు. జనసేన నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చిన తరువాత ఓటేసిన వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారన్నారు. విసికె పార్టీ నాయకులు ముత్యాల మోహన్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. న్యూడెమొక్రసీ నాయకులు విశ్వనాథ్ మాట్లాడుతూ కార్మికుల విషయంలో ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తోందన్నారు. ఎంహెచ్‌పిఎస్ నాయకులు సగీర్ మాట్లాడుతూ పిల్లలకు అన్నం పెట్టే మహిళలను రోడ్డుపై నిలబెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఒపిడిఆర్ నాయకులు ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎస్మా నోటీసు ఇచ్చిన తరువాత న్యాయ సలహా తీసుకోవడం ప్రభుత్వ నిర్లక్ష్యపు పాలనకు నిదర్శనమన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం ప్రజలు, ప్రజాతంత్ర హక్కులపై దాడి అని అన్నారు. వెనక్కు తీసుకోకపోతే లక్షన్నర మండి మహిళలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జన విజ్ఞాన వేదిక నాయకులు టి.హరిశర్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె వెనుక ఐదు లక్షల మంది మహిళల భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు. ఐలు నాయకులు కె.సోమశేఖర్ మాట్లాడుతూ సంక్షేమంలో భాగస్వాములైన అంగన్‌వాడీలను సంక్షోభంలోకి నెట్టారని మండిపడ్డారు. రైతు సంఘం నాయకులు రామచంద్ర మాట్లాడుతూ ప్రస్తుత ఆందోళనలపై బహిరంగంగా చర్చించి ప్రభుత్వం తగిన నిర?యం తీసుకోవాలని పేర్కొన్నారు. కెవిపిఎస్ నాయకులు డి.సి.వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమం పేరుతో రాజకీయ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, రజక సంఘం నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు చేపడతామని అన్నారు. అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి మాట్లాడుతూ జీతాలు పెంచమని కోరుతుంటే ప్రభుత్వ ఉద్యోగులు కాదని చెబుతున్నారని, అలాంటప్పుడు ఎస్మా ఎలా ప్రయోగించారని ప్రశ్నించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- నందలూరు : యువతకు క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని టంగుటూరు జడ్‌పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శ్రీ వినాయక క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉత్సాహంతో క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబరచాలని, క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు కీలక పాత్ర పోషించాలని, గెలుపోటములు సంబంధం లేకుండా క్రికెట్‌లో ఉత్తమ ఆటతీరు ప్రదర్శించాలని అన్నారు. కార్యక్రమంలో నందలూరు మండల పార్టీ కన్వీనర్ అన్నం నాగేంద్రమూర్తి, టంగుటూరు సర్పంచ్ షేక్ మైనుద్దీన్, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ షావలి, మంచా ఫణీంద్ర, షేక్ అబ్దుల్ కలామ్, సుబ్బరాజు, మీనిగ నాగభూషణం, షేక్ సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

రా..కదలిరా సభను విజయవంతం చేద్దాం

- టిడిపి జాతీయనేత నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఈ నెల 24న పీలేరులో జరగనున్న రా.. కదలిరా.. కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, జనసేన నాయకులకు పిలుపునిచ్చారు. పీలేరు పట్టణ శివారులోని ఎపిఐఐసి స్థలం సమీపంలో బహిరంగ సభ నిర్వహించడం కోసం సభాస్థలికి అవసరమైన స్థలాన్ని టిడిపి పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సుధాకరరెడ్డి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి బుధవారం ఓ రైతు పొలాన్ని పరిశీలించారు. 24న జరగనున్న సభకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రానున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ బహిరంగ సభకు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, మహిళా సంఘాలు, సానుభూతి పరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కులమతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతూ అమాయకులపై కేసులు నమోదుచేస్తూ, బలహీన వర్గాల వారిని అణగ ద్రొక్కుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మూడు నెలల తర్వాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, పెనుమార్పు తీసుకు రానున్నారని, కొత్త ప్రభుత్వంతో సరికొత్త యుగం రానుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

రాయచోటిపై మైనార్టీల గురి?

టికెట్ కోసం పార్టీల పెద్దల వద్దకు నాయకుల క్యూ - గెలుపుగుర్రాల కోసం అధినేతల కసరత్తు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయ చోటి అసెంబ్లీకి మైనార్టీ నాయకులు పోటీ చేయాల నుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పేరుగు తోంది. రాయచోటి సుగవాసి, మండిపల్లి కుటుం బాలకు పట్టు కలిగిన నియోజకవర్గం. 2004 తర్వాత నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా లక్కిరెడ్డిపల్లి నియోజ కవర్గం తొలగిచడంతో ఇక్కడ పట్టు కలిగిన రెడ్డప్ప, గడికోట కుటుంబాలు రాయ చోటి నియోజకవర్గంలో కలిసిపోయాయి. ప్రధాన పార్టీల తరపున ఆ రెండు కుటుంబాలదే ఆధిపత్యం కోనసాగుతోంది. ముస్లిం మైనార్టీలు వైసిపి నుంచి పోటిచేయాలని భావిస్తున్నప్పటికీ వరుసగా నాలుగు సార్లు విజయం సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆ పార్టీకి గెలుపు గుర్రం కావడంతో ఆయనకు తప్ప మరొకరికి ఛాన్స్ ఉండదని నిశ్చయించుకున్న మైనార్టీలు చంద్రబాబు నాయుడు చుట్టూ టిడిపి టికెట్ కోసం చక్కర్లు కొడుతున్నారు. రాయచోటిలో విజయాన్ని ప్రభావితం చేసే ప్రాంతం పట్టణంలోని ఈస్ట్ ప్రాంతం. ఈ ప్రాంతంలోని ఎక్కువగా ముస్లిం మైనార్టీలు ఉండటం వందశాతం పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకొన్నవారు ఉండటంతో ఈ ప్రాంతమే గెలుపును డిసైడ్ చేస్తాయి. దాని తర్వాత ఈ ప్రాంతాల్లో రెడ్డి సామాజిక వర్గం ఉన్నప్పటికీ వారు చాలా వరకు బిజెపి పోటీ చేసే అభ్యర్థులకు అంతర్గతంగా సహకరిస్తారని, లేదా పోలింగ్ బూత్ వైపు కన్నెత్తి చూడరనే వాదనలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఒసి, బిసి లలో మైనార్టీలు 65 శాతం ఒటర్లు ఉండటం వారు కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకొంటుడంతో అభ్యర్థుల గెలుపోట ములు వారే డిసైడ్ చేస్తారు. ప్రస్తుతం టిడిపి టికెట్ కోసం టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న రమేష్ కుమార్‌రెడ్డి, మాజీ టిటిడి బోర్డు సభ్యుడు ప్రసాద్ బాబు, మాజీ పిసిసి సభ్యుడు రాంప్రసాద్‌రెడ్డి పోటీ పడుతు న్నారు. ఈ ముగ్గురు నాయకుల గ్రాఫ్‌ను పరిశీలిస్తే రమేష్‌రెడ్డి 1999 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా లక్కిరెడ్డిపల్లి ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో లక్కిరెడ్డిపల్లి టిడిపి అభ్యర్థిగా, 2009లో రాజంపేట టిడిపి ఎంపీ అభ్యర్థిగా, 2014, 2019లో రాయచోటి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా వరుసగా 20 ఏళ్లుగా జరిగిన నాలుగు ఎన్నికల్లో సైతం ఒటమిని మూటగట్టుకున్నారు. ఇక సుగవాసి కుటుంబం నుంచి చేప్పుకోవాలంటే 2004 చివరిసారిగా సుగవాసి పాలకొండ్రాయుడు ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో గడికోట శ్రీకాంత్‌రెడ్డిపై పోటీ చేసి ఓడిపోవడంతో 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి సుగవాసి పాలకొండ్రాయుడు తన యుడు, జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం టిడిపి అభ్యర్థిగా పోటిచేసి గడికోట శ్రీకాంత్‌రెడ్డితో ఒటమిని చవిచుశారు. టిడిపి అధిష్టానం సుగవాసి కుటుంబాన్ని పక్కన పెట్టేసింది. రెడ్డప్ప కుటుంబానికి అవకాశం కల్పిస్తూ వచ్చింది. ఇక మండిపల్లి కుటుంబం నుంచి చేప్పాల్సివస్తే 1995లో మండిపల్లి నారాయణరెడ్డి విజయం సాధించారు. 1999లో మండిపల్లి నారాయణరెడ్డి, పాలకొండ్రాయుడుపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2004 మండిపల్లి కుటుంబానికి చెందిన శ్రీలత, పాలకొండ్రాయుడుపై పోటీ చేసి ఓటమిని చవిచుశారు. 2012లో జరిగిన ఉపఎన్నికల్లో మండిపల్లి రాంప్రసాద్ కాంగ్రెస్ తరపున, 2014 ఎన్నికల్లో జై సమైక్యాంధ్ర తరపున పోటీ చేసి ఓటమిని మూటగట్టుకొన్నారు. వరుస ఓటములను చవిచూసిన రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి, సుగవాసి కుటుంబం, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిపై విజయం సాధించడం ఆశామాసీ కాదని టిడిపి అధిష్టానం భావిస్తోంది. రమేష్ కుమార్ రెడ్డి నాలుగు సార్లు ఒడిపోవడం, రాంప్రసాద్‌రెడ్డి రెండు సార్లు ఒడిపోవడం, ప్రసాద్ బాబు వైసిపి ఆధికారంలోకి రాగానే మున్సిపల్ ఎన్నికల్లో వైసిపికి ప్రచారం చేయడం వంటి అంశాలపై అధ్యయనం చేసిన అధిష్టానం వారిని నమ్మడం లేదని రాయచోటి ముస్లిం మైనార్టీలు భావిస్తున్నారు. టిడిపి టికెట్ కోసం ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి ఆరుగురు నాయకులు వేర్వేరుగా తమకు టికెట్ ఇవ్వాలని చంద్రబాబుకు కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. వివిధ విషయాల్లో మైనార్టీల్లో శ్రీకాంత్‌రెడ్డి పట్ల అసంతృప్తి ఉంది. వక్ఫ్ బోర్డు స్థలం స్వాధీన పరుచటలో విఫలమయ్యారని వంటి అనేక విషయాలను చంద్రబాబుతో మైనార్టీ నాయకులు చర్చించినట్లు తెలుస్తోంది. మైనార్టీలకు టికెట్ ఇస్తే వైసిపి కంచుకోటను బద్దలు చేయెచ్చనే వాదనను చంద్రబాబు బలంగా నమ్మినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మైనార్టీలలో కాంగ్రెసు పార్టీ తరపున 1972, 1978లలో హబీబుల్లా, ఆయన మరణం తర్వాత ఆయన సతీమణి షావరున్నిసా, 2014 లో ఇంతియాజ్, 2019లో అల్లాబకష్, టిడిపి తరపున 1985లో దాదా సాహెబ్, 2009లో ప్రజారాజ్యం తరపున మహబూబ్ బాషా, 2019లో జనసేన తరపున హసన్‌బాష రాయచోటి అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. 1972 కాంగ్రెస్ అభ్యర్థి హబీబుల్లా మినహ మిగిలిన ఆరుగురు అభ్యరులు ఒటమిని చవిచుశారు. టిడిపి టికెట్ కేటాయించిన గెలుపు గుర్రం రేసులో ముందుంటారా...? వేనక బడతారా...అన్నది తెలుసుకోనేందుకు పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్‌ను రాయచోటి ముస్లిం సామాజిక రాజకీయ పరిస్థితులపై ఆరా తీయించారు. టిడిపి ఇన్‌ఛార్జి రమేష్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. అయితే సదస్సుకు ముస్లిం టిడిపి అగ్రనేతలు వేదికపై కనపడ్డారే తప్ప వారి ప్రసంగం వినేందుకు ముస్లిం లేకపోవడం మరి విడ్డూరం. ఏదైనప్పటికి టిడిపి టికెట్ ముస్లిం మైనారిటీలకు ఇస్తారా లేక పాత వారికే ఇస్తారా అనేది వేచి చూడాలి

హామీలను అమలు చేయాల్సిందే

- 16వ రోజూ కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె



నిరసన తెలుతుపున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చెన్నయ్య, సి.రాంబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె 16వ రోజుకు చేరింది. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అనేక దఫాలుగా ప్రభుత్వానికి విన్నవించినా మున్సిపల్ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించలేదని, ముందే సమ్మె నోటీసు ఇచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని కోరినా ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. పాదయాత్రలో సిఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులకు పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలని కోరారు. క్లాప్ వాహనాల డ్రైవర్లకు జిఒ ఏడు ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలని, దళారీ వ్యవస్థను రద్దుచేసి మునిసిపాలిటీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. క్లాప్ వాహనాల డ్రైవర్లకు కాంట్రాక్టర్లు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, వారాంతపు సెలవులు, పండగ సెలవులు అమలు చేయడం లేదని, గుర్తింపు కార్డులు, యూనిఫారమ్, మాస్కులు, గ్లాజులు, కొబ్బరి నూనె వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పండుగ కానుకలు పునఃప్రారంభం అవుతాయని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పీలేరు పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ, తాటిమాను కాలనీ తదితర ప్రాంతాల్లో జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందరరేగా ఆయనకు మహిళలు, అభిమానులు పూల మాలలు, హారతులతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రంజాన్ తోఫా, సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక, పెళ్లి కానుక వంటి పథకాలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసి, ప్రజలకు మోసం చేసిందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వానికి, నాయకులు ప్రజల్లోకి వచ్చి ఓటు అడిగే హక్కును కోల్పోయారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి రద్దు చేసిన పథకాలను పునరుద్ధ రిస్తామని తెలియజేశారు. పేదల కడుపు నింపడం కోసం అన్నా క్యాంటీన్ పేరిట రూ.5 కే నాణ్యమైన భోజనం అందిస్తామని, పేదలు, కార్మికుల ఆకలి తీర్చడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన, నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిద్దయ్య, శిద్దముల్లు, అశోక్, రవికుమార్, వెంకటరమణ, మంగమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.



తలపడుతున్న ఆంధ్ర, గోవా జట్లు

గోవాపై ఆంధ్ర జట్టు విజయం

ప్రజాశక్తి - కడప



6 వికెట్లు తీసిన వాసు



158 పరుగులు చేసిన అభినవ్

ఎసిఎ స్టేడియంలో నాలుగు రోజులపాటు జరిగిన సి కె నాయుడు క్రికెట్ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు గోవా జట్టుపై 53 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఒక వికెట్ నష్టానికి 61 పరుగులు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా జట్టు 98.2 ఓవర్లలో 327 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. ఆ చెట్టులోని అభినవ్ తేజ్ రానా 158(241) పరుగులు చేశాడు. ఆంధ్ర జట్టుకు చెందిన వై.వాసు అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 32.2 ఓవర్లు బౌలింగ్ చేసి అందులో 13 ఓవర్లు మేడిన్ వేసి 97 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ టి.విజయ్ 2 వికెట్లు తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్ఃలో ఆంధ్ర జట్టు 606 పరుగులు వద్ద డిక్లేర్ చేసింది. గోవా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 226 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో 327 పరుగులు చేసింది. ఆంధ్ర జట్టు గోవా ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించింది.

13న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహణకు ఏర్పాట్లను చేస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం, గెట్ టుగెదర్‌కు పూర్వవిద్యార్థులు హజరవుతున్నారని తెలిపారు. పాఠశాలలో చదువు కున్న విద్యార్థులు అందరూ మరల ఒకసారి కలుసుకునేందుకు చక్కని అవకా శమని అన్నారు. పూర్వ విద్యార్థులంతా కార్యక్రమంలో పాల్గొని పూర్వ విద్యార్థులంతా ఈ సమ్మేళనంలో పాల్గొనాలని పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు గౌస్ మొద్దీన్ తెలిపారు.

అవసరం లేని వస్తువులు స్ట్రాంగ్ రూమ్‌లో తొలగించాలి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

జిల్లాలోని ఖజానా కార్యాలయాల స్ట్రాంగ్ రూములలో వివిధ ప్రభుత్వ శాఖలు భద్రపరిచిన అవసరం లేని వస్తువులు తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ట్రెజరీ కార్యాలయాల స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన వస్తువులపై, ఖజానా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందరరేగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో అన్నమయ్య జిల్లా ట్రెజరీ కార్యాలయాల సాంగ్ రూములలో భద్రపరిచిన అవసరం లేని వస్తువులను వెంటనే తొలగించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సామాగ్రి నిల్వ చేసుకునేందుకు స్థలాభావం ఏర్పడుతుందని ఈ కారణంగా వివిధ శాఖలకు సంబంధించిన వస్తువులను తొలగించేందుకు రాష్ట్ర ఖజానా శాఖ జిల్లాస్థాయిలో ఒక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీలలో శాఖల వారీగా భద్రపరిచిన వస్తువులను తిరిగి తీసుకునేవి, తొలగించవలసినవి, భద్రపరచాల్సినవి అనే మూడు విభాగాలుగా గుర్తించడం జరిగిందని, వీటిని పరిశీలించి ఇందులో అవసరం లేని వస్తువులను తొలగించాలని జాయింట్ కలెక్టర్ ట్రెజరీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి మహబూబ్, ఎటిఒ ఖాదరవల్లి, ఎస్‌టిఒ గోపాల్, రమేష్, హరీష్ యాదవ్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


గుంతలమయంగా ఉన్న రోడ్డు

గుంతల మయంగా ప్రధాన రహదారి

పట్టని అధికారులు - ఇబ్బందుల్లో వాహనదారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రేణిగుంట-కడప ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. రైల్వే కోడూరు నుంచి రేణిగుంట వరకు, ఇటు రాజంపేట వరకు రోడ్ల దుస్థితి ఇదేవిధంగా ఉంది. రోడ్డుపై పెద్ద ఎత్తున గోతులు పడడంతో వాహనాలు ఆ గుంతలలో పడి తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు గుంతలలో పడి ప్రమాదానికి గురై గాయాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణులు ఈ మార్గంతో భయాందోళనకు గురవుతున్నారని, వర్షాలు కురిసి వారాలు, నెలలు గడుస్తున్నా ఇంతవరకు సంబంధిత అధికారులు రోడ్లకు మరమ్మతులు చేయకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు రోడ్ల మరమ్మతులు చేపట్టి వాహనాలను, ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

నేడు బి.కొత్తకోటలో గడప గడపకూ..

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్అహ్మద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హాజరవుతారని అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి నుంచి ప్రారంభించి ఉజార్లపల్లి, ఎద్దులవారిపల్లి, మొర్రోళ్లపల్లి, నక్కరాసపల్లి, సంద్రామాకులపల్లి, జనుపవారిపల్లి, ఆలేటిపల్లి, బాలసానిపల్లి, తాకటంవారిపల్లి, దేగానిపల్లి, బద్దిపల్లి, అయ్యవారిపల్లిలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు గృహసారథులు తెలిపారు.

కోడిపందేలకు దూరంగా ఉండాలి

- శిక్షణ డిఎస్‌పి ప్రశాంత్

ప్రజాశక్తి-బి.కొత్తకోట



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కోడిపందెం, పేకాట వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని శిక్షణ డిఎస్‌పి ప్రశాంత్ ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున కోడిపందెం, జూదాలు జరిగే అవ కాశం ఉందని వీటికి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబం ధనలకు వ్యతిరేకంగా జూదం, కోడిపందేలను నిర్వహించినా, ఆడినా కఠిన చర్యలు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతం సరిహద్దుల్లో కర్ణాటక సరిహద్దులో ఉండటంతో అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు.


మల్లయ్యకొండను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మల్లయ్య కొండ అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి ఇకోటూరిజం శాఖ అభివృద్ధికి కోటి రూపాయల నిధులు మంజూరైనట్లు అటవీశాఖ సబ్ డిఎఫ్ఒ శ్రీనివాసులు, రేంజర్ మదన్మోహన్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం మల్లయ్య కొండను సందర్శించారు. ఆలయ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు వారికి స్వాగతం పలికారు. గౌరమ్మ గుట్ట వద్ద టూరిజం శాఖ వారు గుర్తించిన వ్యూ పాయింట్ నిర్మాణ స్థలాన్ని, ఫారెస్ట్ క్వాటర్స్ నిర్మాణానికి స్థలాలను పరిశీంచి అంచనా నివేదికలను పంపుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మల్లయ్యకొండ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. త్వరలో పను లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెఇపారు. వారి వెంట ఎఫ్‌డిఒలు రెడ్డివరప్రసాద్, రామ్‌రాజ్ ఉన్నారు.

జిఒ 512 రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - చాపాడు

ప్రజలకు, రైతులకు, న్యాయ విభాగంలో నష్టం చేకూర్చే పద్ధతిలో తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023 చట్టాన్ని రద్దు చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ పేర్కొన్నారు. బుధవారం చాపాడు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఈ చట్టానికి వ్యతిరేకంగా మండల రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తహ శీల్దార్ యామినికి వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో రమణతోపాటు రైతు సేవా సమితి మైదుకూరు నియో జకవర్గ కార్యదర్శి రామాంజనేయులు, చాపాడు మండల రైతు నాయకులు, రామకృష్ణ, నాగేశ్వర్‌రెడ్డి, వెంక టేష్, భాస్కర్, పుష్పరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు బ్రహ్మ య్య, న్యాయ విద్యార్థి విభాగం నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ సేవలపై ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రజలు బిఎస్ ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలు సద్వినియోగం చేసుకో వాలని ఎజిఎం శ్రీని వాసరావు కోరారు. బుధ వారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎన్‌టిఆర్ సర్కిల్, 7 రోడ్లు, పాత కలెక్టరేట్ మీదుగా బిఎస్ఎన్ఎల్ కార్యా లయం వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో 4జి సేవలు ప్రారంభమ వుతాయని చెప్పారు. తక్కువ ధరతో అందిస్తున్న బ్రాడ్ బ్యాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భారత ప్రభుత్వ సంస్థగా ఉన్న బిఎస్ఎన్ఎల్ హైసెక్యూరిటీగా ఉంటుం దని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎజిఎం లక్ష్మణ్ నాయక్, బిఎస్ఎన్ఎల్ ఇయు జిల్లా కార్యదర్శి ఆకుల సుబ్బారెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కళ్యా సుధాకర్, సహాయ కార్యదర్శి రెడ్డెప్ప పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఆడుదాం ఆంధ్ర క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ శేషగిరిరావు పేర్కొన్నారు. మండల స్థాయి ఆడదాం ఆంధ్ర క్రికెట్ పోటీలను ఎంపిడిఒ శేషగిరిరావు స్థానిక జడ్‌పి హైస్కూల్ (తెలుగు) క్రీడా మైదానంలో ప్రారంభిం చారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు.యువత క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటు న్నారని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నియోజ కవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, ఎర్రమల్లయ్య నాయుడు, పిఈటి మణికంఠ, సచివాలయ సిబ్బంది మనోజ్, పవన్, నరేంద్ర, రెడ్డి రాజేశ్వరి, పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** పట్టణంలోని టమోటా మార్కెట్ మైదా నంలో ఆడదాం ఆంధ్ర క్రీడలను


నిమన్నపల్లి: క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందిస్తున్న ఎంపిడిఒ


తంబళ్లపల్లి: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిడిఒ సురేంద్రనాథ్

కమిషనర్ పి.ఆర్.మనోహర్ ప్రారంభిం చారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, సచివాలయ కన్వీనర్ కంచి కల్యాణ్ కుమార్‌రెడ్డి, చాంద్ బాషా, జివి.రామకృష్ణ, రమేష్ రెడ్డి, రాజా పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఎంపిడిఒ సురేంద్రనాథ్ ప్రారంభించారు. రేణిమాకుల పల్లె ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు జరిగాయి. ఎనిమిది క్రికెట్ జట్టులు పోటీలలో పాల్గొన్నారు. కన్నెమడుగు ఉన్నత పాఠశాల మైదానంలో బాలికలకు వాలీబాల్ పోటీలు జరిగాయి. ప్రతిభా కనబరచిన క్రీడాకారులకు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రమేష్, మదన్మోహన్ , పీడీ మొగల్ ఖాదర్‌బాషా, పిఇటి చలపతిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న విజ్‌డమ్ సిబిఎస్ఇ హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వివిధ రకాల వేషధారణలో అలరించారు. పల్లెటూరి వాతావరణం మరిపించేలా రంగవల్లులు, భోగి మంటలు వేసి కోలాటాలు ఆడారు. పొంగల్లు వండారు రకరకాల బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు నృత్య గీతాలతో అలరించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రజలంతా కలిసిమెలిసి జరుపుకునే పండుగ సంక్రాంతి అని అందరూ సుఖసంతోషాలతో ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆటల పోటీల్లో వేషధారణలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ టి.మదన్మోహన్, ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


రైల్వేకోడూరు : సంప్రదాయ దుస్తులతో చిన్నారులు, ఉపాధ్యాయులు

ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమే : డిఎస్‌పి


బదిలీపై వెళ్తున్న సిఐ, ఎస్ఐలను సన్మానిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమే రాయచోటి డిఎస్‌పి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి సర్కిల్ నుంచి సిఐ వరప్రసాద్, రామాపురం ఎస్ఐ కొండారెడ్డి, లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, గాలివీడు ఎస్ఐఐ శివకు మార్‌లు బదిలీపై వెళ్లిన సందర్భంగా బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి డిఎస్‌పి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి సర్కిల్ పరిధిలో తక్కువ సమయంలో పనిచేసి మంచి మన్ననల పొందారని సిఐ,ఎస్ఐలను కొనియాడారు. ఈ ప్రాంతం పోలీసులు ప్రజల్లో మమేకమై సేవలు అందించాలని అన్నారు. మూడు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని అప్రమత్తంగా ఉండి ఎలాంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. ఇప్పటినుంచి ప్రతి గ్రామంలో పోలీసులు గ్రామ సభలు ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలాగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐలు జీవన్, రంగనాథబాబు, రామకృష్ణారెడ్డి, తులసీరామ్, సుధాకర్‌రెడ్డి, మహబూబ్ బాషా, లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ విష్ణువర్ధన్, హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

ఉత్తమ విజ్ఞాన వంతులుగా తయారవ్వాలి : విసి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రపంచ అవసరాలకు తగ్గట్టు ఉత్తమ విజ్ఞానవంతులైన పౌరులుగా, పరిశోధకులుగా తీర్చిదిద్దడమే యోగివేమన విశ్వవిద్యాలయ లక్ష్యమని విసి ఆచార్య చింతాసుధాకర్ అన్నారు. వైవియూ ఎపిజె అబ్దుల్ కలాం ప్రాంగణంలో నూతన విద్యార్థులకు పరిచయ, ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ఒక ప్రత్యేకత కలిగిన విశ్వవిద్యాలయం వైవియు అన్నారు. విశ్వవిద్యాలయ వనరులను సద్వినియోగం చేసుకొని గొప్పవారుగా మారాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, పోటీ ప్రపంచానికి తగ్గట్టు చదువులు, ఆలోచనలు సాగించాలన్నారు. గ్రంథాలయంలో వేల పుస్తకాలు జర్నల్స్ ఉన్నాయని, నిపుణులైన అధ్యాపకుల, పరిశోధకుల సహకారం అందుకోవడానికి సిద్ధం కావాలన్నారు. ప్రిన్సిపల్ ఎన్.రఘునాథరెడ్డి సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సమాజ అవసరాలకు తగ్గ నైపుణ్యాల అందించే బోధన, శిక్షణ ఇక్కడ అందుతుందన్నారు. ఆహ్లాదకరమైన వాతవరణంలో చక్కగా చదువుకుని మీ తల్లి దండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని ఉద్బోధించారు. కడప జైళ్ల సూపరింటెండెంటు ఐ.ఎన్.హెచ్ ప్రకాష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో చదువుకునే అవకాశం దక్కించుకున్న మీరు ఇక్కడ నుంచి ఉన్నత స్థానంలోకి వెళ్లేలా రెండేళ్ల ప్రణాళిక తయారు చేసుకుని అమలు చేసుకోవాలన్నారు. ప్రొఫెసర్లు మీ లోపాలను ఎత్తిచూపుతున్నారంటే మిమ్ములను గొప్పవ్యక్తులుగా చూడాలనే ఉద్దేశం తప్ప మరొకటి ఉండదన్నారు. మి మ్ము లను మీరు అంచనా వేసుకొని అవసరమైన నైపుణ్యాలను సాధించాలన్నారు. మిస్టర్. వి ఇనిస్టిట్యూట్ సంచాలకులు వై. భాస్కర్ వర్మ మాట్లాడుతూ సాంకేతికత మన ఎదుగుదలకు ఉపయోగపడాలకా నీ నాశనం కావడానికి కాదన్నారు. కార్యక్రమంలో సహ ఆచార్యులు డాక్టర్ సరిత, డాక్టర్ సునీత, సహ ఆచార్యులు డాకటర్ రియాజున్నీసా, డాక్టర్ అనూ ప్రసన్న అతిథులను సభకు పరిచయం చేశారు. కల్చరల్ విభాగ సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, అధ్యాపకులు, స్కాలర్లు, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విసి ఆచార్య చింతా సుధాకర్

ఉచితంగా బీమా సౌకర్యం

ప్రజాశక్తి - కడప: ప్రవాసీ భారతీయ దివస్ రోజు కువైట్ రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సుమారు 500 మందికి పైగా ఎపిఎన్ఆర్‌టిఎస్ ప్రవాసాంధ్ర భరోసా బీమా, ఎపి ప్రభుత్వం కల్పించిన 50 శాతం రాయితీ పురస్కరించుకుని, కుల మతాలకు అతీతంగా రూ.275 ప్రతి ఒక్కరికీ ఉచితంగా హవెల్లి ప్రాంతంలో ఉన్న షాబ్ పార్క్‌లో బుధవారం నమోదు చేశారని కువైట్ రెడ్డీస్ సంఘం అధ్యక్షులు నాయని మహేష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు ముమ్మడి వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంచి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎపిఎన్ఆర్‌టిఎస్ అధ్యక్షులు మేడపాటి వెంకట్, డైరెక్టర్ ఇలియాస్, వైసిపి కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, రెడ్డీస్ అసోసియేషన్ సభ్యులు మన్నూరు చంద్ర శేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు సురేష్ కుమార్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు: విభిన్నప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని, అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం విడుదల చేసిన బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. పదిరోజుల క్రితం ట్రైసైకిళ్లను పంపిణీ చేసి మిగిలిన వారికి కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులు కూడా అన్ని రంగాల్లో రాణి స్తున్నారన్నారు. ఇందుకు సజీవ సాక్షాలు ఎన్నో ఉన్నాయన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఎవ్వరికీ తీసిపోరని దృఢ సంకల్పంతో అనుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ద తీసుకుంటుందన్నారు. కార్యక్ర మంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్‌ఛైర్మెన్ ఆయిల్‌మిల్ ఖాజా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

వేంపల్లె : మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు వాలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపిడిఒ సంపతి దివిజ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇడుపులపాయ, అయ్యవారిపల్లె గ్రామంలో ఖాళీగా ఉన్న వాలింటీర్లు పోస్టులకు 11,12 తేదీల్లో అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చు అన్నారు. వీరికి ఈనెల 14 నుండి 17 వరకు ఇంటర్వ్యూలు నిర్వహి స్తారన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎక్కువ పరిహారం వచ్చేందుకు కృషి

వేంపల్లె : చాగలమర్రి-రాయచోటి నేషనల్ హై రోడ్డు నిర్మాణంలో భూములు, ఇంటి స్థలాలు కోల్పోయే రైతులు, స్థల యజమానులకు నష్టపరిహారం ఎక్కువ వచ్చేందుకు కృషి చేస్తామని తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ చాగలమర్రి నుండి రాయచోటి వరకు వేసే జాతీయ రహదారి నిర్మాణంలో 150 మంది దాదాపు 43 ఎకరాలు భూమి కోల్పుతున్నట్లు చెప్పారు. భూములు, స్థలాలు కోల్పోయేవారు సహకరించాలని కోరారు. వ్యవసాయ భూమి అయితే మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.6 లక్షలు పరిహారం ప్రభుత్వం ఇస్తుందన్నారు. మార్కెట్ విలువ ప్రకారం ధర నిర్ణయిస్తారని తెలిపారు. ఇంటి నిర్మాణం ఉంటే వాటి విలువ ప్రకారం కూడా పరిహారం ఇస్తారని తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివలక్ష్మి, మండల సర్వేయర్ శివారెడ్డి, గ్రామ సచివాలయం సర్వేయర్లు శివశంకర్‌రెడ్డి, బ్రహ్మం, విఆర్ఒ రవీంద్రారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు రైతులతో గ్రామసభలు

ఎర్రగుంట్ల : వేంపల్లి నుండి చాగలమర్రి వరకు నిర్మిస్తున్న రోడ్డు విస్తరణకు రైతులతో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని హనుమన గుత్తి, పొట్లదుర్తి, పెదనపాడు, కోడూరు, ఎర్రగుంట్ల గ్రామాల రైతులకు రోడ్డు విస్తరణలో భాగంగా నష్ట పరిహార విషయమై గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభలో రెవెన్యూ డివిజనల్ అధికారి నాగరాజు పాల్గొంటారని తెలిపారు. హనుమనగుత్తి, పొట్లదుర్తి, పెదనపాడు, గ్రామాలకు సంబంధించి గ్రామ పంచాయితీ కార్యాలయాల్లోనే గ్రామసభ నిర్వహిస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప : ప్రతి ఒక్కరూ చట్టాలబ్బాయి అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ అన్నారు. నేక్‌నామ్ కళాక్షేత్రంలో దాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసిన నాబార్డ్ గ్రామీణ మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 2019, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్, నల్సా పథకాల గురించి వివరించినారు. కార్యక్రమంలో దాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఓబుల్ దాస్, గిరిజన కో-ఆపరేటివ్ మార్కెటింగ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రమణారెడ్డి, పారా లీగల్ వాలంటీర్ జె.సురేష్, సహాయం పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జగన్మోహన్‌రాజు

యువత క్రీడల్లోనూ రాణించాలి :'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని సానిపాయ గ్రామంలో సంక్రాంతి సంబ రాలలో భాగంగా టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు.ఉత్సాహంతో క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్క క్రీడాకా రుడు కీలక పాత్ర పోషించి గెలుపోటములతో సంబంధం లేకుండా ఉత్తమ ఆట తీరును ప్రదర్శించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, బిసి నాయకులు జయరాంయాదవ్, మైనారిటీ నాయకులు కాలేశా, చలపతి నాయుడు, మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

'సంకల్ప యాత్ర' పై అవగాహన

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని రామానాయక్ తాండ గ్రామపంచాయతీలో కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించనినట్లు ఎంపిడిఒ శ్రీధర్‌రావు పేర్కొన్నారు.ఆయుష్మాన్ భారత్, పిఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన, వెలుగు సిబ్బంది ద్వారా దీన్ దయాల్ అంత్యోదయ యోజన, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా పిఎం ఆవాస్ యోజన, ఉజ్వల పథకం, జల్‌జీవన్ మిషన్, విశ్వకర్మ పథకం, పిఎం కిసాన్ వంటి పథకాలపై అమలును ప్రజలకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి జనార్దన్, డిటి గౌరీశంకర్, మండలస్థాయి అధికారులు , సర్పంచ్ శిరీష పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని దేవగుడిపల్లి గ్రామంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మారుమూల గ్రామాల్లోని ప్రజలు సహా ప్రతి ఒక్కరికీ అవగాహన పెంపొందించడంతో పాటు అర్హులుఅందరికీ కేంద్ర పథకాలు అందేలా చేయడమే వికసిత్ భారత సంకల్పయాత్ర లక్ష్యమని ఎంపిడిఒక దివ్య పేర్కొన్నారుకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమృతమ్మ, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో 'జన్ బాగ్దారి'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈనెల 29న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో భారతదేశ రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ 135 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని ఎంపిడిఒ సి.శంకరయ్య తెలిపారు. జన్ బాగ్దారి కార్యక్రమం సందర్భంగా అన్ని మండలాల్లో అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేయడం, ర్యాలీలు నిర్వహించడం, అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాల విద్యార్థుకు అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఉన్నతమైన చదువులు చవివి మేధస్సును సంపాదించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంఇఒలు, ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపిడిఒ శంకరయ్య, ఉపాధ్యాయులు

క్రైం కార్నర్


కోడి పందెం రాయుళ్ల అరెస్టును చూపుతున్న పోలీసులు

10 మంది కోడిపందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని కాలవపల్లి పంచాయితీ బుద్ధలవారిపల్లి సమీపంలో బుధవారం కోడిపందెం ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గాయత్రి పేర్కొన్నారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసి కోడిపందెం ఆడుతున్న పదిమంది కోడిపందెరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.13100లు నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ మనోహర్, సిబ్బంది మహేంద్ర కుమార్, సుబ్బు, వెంకీ, హరి, సిరాజ్, నాగిన్, చిరంజీవి, అమరేష్ పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

అక్రమంగా తరలిస్తున్న రూ.12 లక్షలు విలువ చేసే 8 ఎర్రచందనం దుంగలను, కారును స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీశాఖ సంచారదళ నిఘా విభాగం డిఎఫ్ఒ జెవి.సుబ్బారెడ్డి తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందని మంగళవారం రాత్రి తమకు అందిన సమాచారం మేరకు, చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం కొత్తపేట సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రొంపిచర్ల వైపు నుంచి వేగంగా వచ్చిన కారును ఆపాలని సిగ్నల్ ఇచ్చామని చెప్పారు. బుధవారం ఉదయం ఆ వాహనం ఆగకుండా వేగంగా గంగాధరనెల్లూరు వైపు దూసుకు వెళ్ళిందని తెలిపారు. అప్రమత్తమైన తమ సిబ్బంది ఆ వాహనాన్ని వెంబడించగా గంగాధర నెల్లూరు మండలం కొత్త వెంకటాపురం వద్ద కారు ఆపి డ్రైవర్ చీకట్లో పరారయ్యాడని తెలిపారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 208 కేజీల బరువు గల 8 ఎర్రచందనం దుంగలను గుర్తించినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న కారు ఎర్రచందనం విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఆర్ఒఎన్ వెంకటరమణ, ఎఫ్‌బిఒకె. ప్రతాప్, ప్రొటెక్షన్ వాచర్లు ప్రభుతేజ, వెంకటేష్, మల్లికార్జున, డ్రైవర్, చరణ్ పాల్గొన్నారు.


పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, కారుతో అటవీశాఖ సిబ్బంది